క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎంపీటీసీ కృష్ణందొర

మాడుగుల రూరల్ : మండలం అవురువాడ గ్రామంలో ఈ నెల 18 న జరిగిన అగ్ని ప్రమాదంలో తుమ్మి అప్పారావు తాటాకు ఇల్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో ఈ సిగ్మెంటు ఎంపీటీసీ చదల కృష్ణందొర తన సొంత నిధులతో సమకూర్చిన నెల రోజులకు సరిపడా బియ్యం, పప్పు, నూనె, మిరపకాయలు తదితర స్వయం పాకం సరుకులు, వారి కుటుంబానికి దుస్తులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిముడు త్రిమూర్తుల దొర, టి.బన్ని, ఇ.టి.రాజు, ఆర్ మోవల్లదొర, కొంగల శ్రీను పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 16 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ : చుక్కపల్లిలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 16 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో 54 మందికి కంటి పరీక్షలు చేయగా, వీరిలో 30 మందికి చిరు కంటి సమస్యలకు మందులు అందించామన్నారు. 16 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని, వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో తీర్థాలు

దేవరాపల్లి : మండలంలోని మూడు గ్రామాల్లో సోమవారం గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు నిర్వహించడానికి ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గరిశింగిలో శ్రీవరదేశమ్మ తీర్థ మహోత్సవాన్ని, బోయిలకింతాడలో శ్రీ మరిడిమాంబ తీర్థ మహోత్సవాన్ని, కె.ఎం.పాలెం పంచాయతీ శివారు యండపల్లిపాలెంలో అచ్చియ్యమ్మ సన్యాసమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవాలను నిర్వహించేందుకు ఆయా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆయా గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు వద్ద జలపాతంలో జలకాలాట

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద అదివారం సందర్శకులతో సందడి నెలకొంది, ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో సందర్శకులు జలకాలాట అడుతూ ఉత్సాహంగా గడిపారు. సంహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలక్షేపం చేశారు. రెండు జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల తాకిడి పెరిగింది.

నేడు అర్జునగిరి మరిడిమాంబ తీర్థం

చీడికాడ : అర్జునగిరిలో గల మరిడిమాంబ తీర్థ మహోత్సవం సోమవారం జరుగుతుందని సర్పంచ్ బి.రమాదేవి తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరుగుతాయని ఆమె తెలిపారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మంచు వదలదు... పూత నిలవదు..

- జీడిమామిడిని దెబ్బతీస్తున్న పొగమంచు
- మాడిపోతున్న పూత
- పిందెలు దిగక రైతులు దిగులు



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న పొగమంచు



పొగమంచుతో మాడిపోయిన మామిడిపూత

బుచ్చెయ్యపేట : జీడిమామిడి తోటలపై పొగ మంచు ప్రభావం అధికంగా ఉంది. ఆశాజనకంగా ఉన్న జీడిమామిడి పూతను పొగమంచు దెబ్బ తీస్తుంది. చలికాలం పోయి వేసవి కాలం సమీపిస్తున్నా పొగ మంచు తగ్గుముఖం పట్టలేదు. మండలంలో పగలు ఎండ కాస్తున్న రాత్రిపూట చలి తీవ్రత మంచు కురవడం ఎక్కువైంది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటలు వరకు తేనె మంచు దట్టంగా కురుస్తుంది. జూన్ నెల నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు అధికంగా వర్షాలు కురవడంతో అన్ని గ్రామాల్లో జీడి, మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా పూస్తుంది. పూత పూస్తున్న తేనెమంచు దెబ్బకు జీడిమామిడి పూత మాడిపోతుంది. పూత మాడిపోయి పిందెలు రావడం లేదు. ఇప్పటికే పలు ధపాలుగా మందులు పిచికారి చేసినా ఫలితం లేదు. వేలాది మంది మెట్ట ప్రాంత రైతులు జీడిమామిడి తోటలపై ఆధార పడి జీవిస్తున్నారు. జీడిమామిడి తోటలను నమ్ముకుని వేలాది రూపాయిలు పెట్టుబడులు పెట్టిన రైతులు తేనె మంచు వల్ల పిందెలు దిగక నష్ట పోతామని వాపోతున్నారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో మల్లాం, రాజాం, కొండెంపూడి, పెదమదీన, ఆర్. భీమవరం, పెదపూడి, కందిపూడి, సీతయ్యపేట, కరక, తురకలపూడి, తైపురం, చిట్టియ్యపాలెం, వడ్దాది, పి.భీమవరం, చిన అప్పనపాలెం తదితర గ్రామాల్లో విస్తారంగా జీడిమామిడి తోటలు సాగు చేస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలపై రైతులు ఆధారపడి ఉన్నారు. కాకినాడ, రాజమండ్రి, అమలాపురం, ఏలూరు తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు ఇక్కడ మామిడి తోటలను లీజుకు తీసుకుని జీడిమామిడి కాయలను అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే జీడిమామిడి తోటలకు రైతులు సేంద్రియ ఎరువులు, క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడానికి, రసాయిన ఎరువులకు ఎకరాకి రూ. పది వేలు వరకు ఖర్చుచేశారు. జీడిమామిడి చెట్లు పూత నుండి పిందెకట్టే దశలో ఉండగా పూత మాడిపోయి పిందెలు రాకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పొగమంచు కారణంగా నష్టాలు తప్పవని పలువురు రైతులతో పాటు జీడిమామిడి తోటలను లీజుకు తీసుకున్న రైతులు వాపోతున్నారు.



భీమవరంలో విస్తారంగా సాగవుతున్న మామిడితోట

కంటి శస్త్ర చికిత్సలకు 30 మంది ఎంపిక

కె.కోటపాడు : కంటి సంబంధిత సమస్యలకు సకాలంలో మెరుగైన వైద్యం పొందాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ దివ్య అన్నారు. చౌడువాడ రామాలయం వద్ద ఆదివారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 65 మందికి తనిఖీలు చేసి, వీరిలో 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినీకుమార్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కంటి పరీక్షలను చేస్తున్న దృశ్యం

నాడు-నేడుకు నిధుల కటకట

- సుందరకోటలో నిలిచిన పాఠశాల భవనం పనులు
- పరాయి పంచన గిరిజన విద్యార్థులకు బోధన



అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్న నూతన భవనం

నాతవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు -నేడు నిధులు నిలుపుదల చేయడంతో గిరిజన విద్యార్థులకు నూతన భవనం నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతమైన సుందరకోట గ్రామంలో పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాడు-నేడు పథకంలో రెండో విడతలో సుందరకోటలో భవనం నిర్మాణానికి రూ.42 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో భవనంతో పాటు బోరు ప్రహరీగోడ వంట షెడ్డు నిర్మించాలి. ఈ పనులు పాఠశాల యాజమాన్య కమిటీ ప్రధానోపాధ్యాయులు సంయుక్తంగా చేసేవారు. చేస్తున్న భవన నిర్మాణ పనులు బట్టి డబ్బులు విడతలు వారీగా చెల్లింపులు చేస్తుండేవారు. గత ప్రభుత్వం హయాంలో సుమారుగా రూ.18 లక్షలు వరకు భవనం పనులు చేయడంతో డబ్బులు చెల్లింపులు చేశారు. ఆ నిధులతో భవనం నిర్మించి బోర్లు ఏర్పాటు చేశారు. ఈలోగా ఎన్నికలు రావడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాడు నేడు పథకానికి నిధులు నిలుపుదల చేశారు. నిధులు లేకపోవడంతో అసంపూర్తి పనులతో భవనం, బోరు దర్శనమిస్తోంది. ప్రహరీగోడ నిర్మించి, మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు వంట షెడ్లు నిర్మించి, అసంపూర్తిగా ఉన్న బోరుకు కూళాయిలు ఏర్పాటు చేసి విద్యుత్ మీటరు అమర్చాలి. నిధులు నిలుపుదల చేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ గిరిజన గ్రామంలో పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో పరాయి పంచన విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అసంపూర్తి భవనం వృథాగా వదిలేయడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

వైభవంగా సీతారాముల తీర్థాలు



తామరంలో బహుమతులు అందజేస్తున్న హరిబాబు, తదితరులు

మాకవరపాలెం: గ్రామాల్లో సీతారాముల తీర్థమహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని తామరం, జీ వెంకటాపురం, అప్పన్నదొరపాలెం, జి.గంగవరం గ్రామాల్లో సీతారాముల తీర్థ మహోత్సవాలు జరిగాయి. స్థానిక రామాలయాల వద్ద తీర్థాలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక భజనలు చేశారు. తామరంలో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

జంపెనలో రాముల వారి తీర్థం

మాడుగుల : జంపెన గ్రామంలో ఆదివారం రాముల వారి తీర్థం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు రాములు వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మరిడి మాంబ తీర్థం

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామస్తులు మరిడిమాంబ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి మరిడిమాంబ అమ్మవారికి పూజా కార్యక్రమాలను జరిపేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు అమ్మవారి పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా బంధువులు, స్నేహితులు రాకతో గ్రామమంగా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



కె.కోటపాడులో మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



రాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు రాజాంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

బుచ్చెయ్యపేట : రాజాం గ్రామంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆంజనేయస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఈ కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశామని గెలుపొందిన మొదటి నలుగురు విజేతలకు వరుసగా రూ.10,8,6,4 వేలు నగదును నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులు అందిస్తామన్నారు.

రేపు మండల సమావేశం

మాడుగుల రూరల్ : ఈ నెల 21 మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ టి.రాజారామ్ అధ్యక్షతన జరగనున్న ఈ బడ్జెట్ సమావేశానికి ఆహ్వానితులు విధిగా హాజరై సమావేశం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు



ఆలయంలో ప్రతిష్టాపనకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో నూతన రామాలయంలో సీతారాముల, విఘ్నేశ్వర, హనుమాన్, లక్ష్మణ ఉత్సవాల ప్రతిష్టోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు కమిటీ తెలిపింది సంప్రదాయ, ఆచారాలతో విగ్రహాలను ప్రతిష్టించి, పూజా కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు



పశు వైద్యాధికారి మంజుషారాణి

దేవరాపల్లి : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎం. అలమండ, దేవరాపల్లి పశువైద్యాధికారి కె.మంజుషారాణి తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పశు ఆరోగ్య శిబిరాలు ఈ నెల 31 వరకు జరుగుతాయన్నారు. ఈ శిబిరాలలో సంతానలేమి పశువులకు చికిత్స, పెద్ద పశువులకు, దూడలకు నులి పురుగుల నివారణ మందు, టీకాలు వేస్తామన్నారు. పశు వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పశు వైద్యశాలలకు దూరంగా 20 పంచాయతీలలో ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పశువైద్యాధికారి మంజుషారాణి స్పష్టం చేశారు. పాడి రైతులంతా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆస్పత్రిలో మౌలిక వసతులకు విజ్ఞప్తి

రోలుగుంట : మండలంలో ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాల ఏర్పాటు గురించి విశాఖ వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు పచ్చిగోళ్ల ఈశ్వర్రావు కలిసి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాల అవసరాన్ని వివరించి వినతిపత్రాన్ని అందజేసినట్టు ఆయన మండల విలేకరులకు తెలిపారు. మంత్రి సమస్యలు విని సానుకూలంగా స్పందించినట్టు వివరించారు.



మంత్రి సత్యకుమార్‌కు వినతి అందజేస్తున్న బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఈశ్వర్రావు

అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్

ఎస్.రాయవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని, వెంటనే రాజీమానా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పెదగుమ్ములూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నిరసన తెలిపారు. అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బీజేపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్న బీజేపీ నేతలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపక పోవడం దారుణమన్నారు. అంబేడ్కర్‌ను కించపరచడంతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించారని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ, స్థానిక నాయకులు భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల తరువాత కలిశారు..ఆనందం పంచుకున్నారు



అపూర్వ కలయికకు హాజరైన పూర్వ విద్యార్థులు



నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారంతా 1994-95 విద్యాసంవత్సరంలో పది చదువులను పూర్తి చేశారు. ఐదేళ్ల పాటు ఇదే పాఠశాలలో 6 నుండి 10 వ తరగతి వరకూ ఎ.కోడూరు, ఎ.భీమవరం, పొడుగుపాలెం, సూర్రెడ్డిపాలెం, వారాడ, వి,సంతపాలెం, ఆర్.వై.అగ్రహారం, ములకలాపల్లి, బొయిల కింతాడ, కలిగొట్ల, వేచలం గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువులు సాగించారు. పాఠశాల చదువులు పూర్తయి 30 ఏళ్లు కావస్తుండడంతో వారంతా మరలా చదువుకున్న పాఠశాలలోనే ఆత్మీయ సమావేశం ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి 90 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. నాడు తమకు బోధన జరిపిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితులంతా ఐకమత్యంగా ముందుకు సాగుతూ, ప్రతీ ఒక్కరి కష్టాసుఖాలలో పాలు పంచుకోవాలని ఆకాంక్షించారు. పూర్వపు విద్యార్థులు తర్రా శేషు, తర్రా వరహాలు, చొక్కాకుల కోటేశ్వరరావు, కిల్లి సింహచలంనాయుడు, గౌరినాయుడు, పైల లక్ష్మణరావు, నాని, సత్యనారాయణ, పాటూరి నాయుడు, చిరికి నాయుడు, సూర్రెడ్డి జగ్గునాయుడు పాల్గొన్నారు.

జీకోడూరు ఉన్నత పాఠశాలలో...

మాకవరపాలెం : ఇరవై రెండేళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండలంలోని జీ.కోడూరు ఉన్నత పాఠశాలలో 2002-03 ఏడాదిలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రాచపల్లి జంక్షన్ సమీపంలో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 22 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని ఒకరికి ఒకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు.



జీకోడూరు హైస్కూలు పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రైవాడలో సమావేశమైన ఎం.అలమండ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సమ్మేళనంలో సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-1989లో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రైవాడలో ఆదివారం జరిగింది. 36 ఏళ్ల తర్వాత కుటుంబ సమేతంగా కలిసిన వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ అలరించారు. సహ పంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె. నాగేశ్వరరావు, ఆర్.అప్పలనాయుడు, ఎం.శ్రీను, పి. సత్యనారాయణ, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

మాకవరపాలెం: మండలంలోని అడిగర్లపాలెంలో భగవాన్ వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం యోగి వేమన జయంతిని నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం త్రైత సిద్ధాంత భక్తులు మాట్లాడుతూ వేమన 3000 పద్యాలను రచించారన్నారు. ఆయన రచించించిన పద్యాలలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మల జ్ఞానం ఇమిడి ఉందన్నారు. వేమనను ఒక కవిగా చెప్పుకోవడం దురదృష్ట కమన్నారు. వేమనను కవిగా కాకుండా భగవంతుడుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



అడిగర్లపాలెంలో వేమన జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

చోడవరం : రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రావికమతం మండలం దొండపూడి గ్రామంలో తానుబిల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి యువకుల నుంచి మంచి స్పందన వచ్చింది. 50 మంది యువకుల రక్తదానం చేశారు. విశాఖపట్నం విజయశ్రీ బ్లడ్ బ్యాంక్, విశాఖ బ్లడ్ బ్యాంక్ నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది ఈ శిబిరంలో రక్త సేకరణ చేశారు. కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్, గ్రామ పెద్దలు , ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో ఘనంగా మరిడమ్మ పండగ

మాడుగుల రూరల్ : మండలం కేజేపురం గ్రామంలో ఆదివారం మరిడమ్మ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. ఉత్సవ కమిటీ ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.